

ఏకలవ్య ప్రవేశ పరీక్ష 20కి వాయిదా

పాడేరురూరల్, ఏప్రిల్ 8: కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూళ్లలో 2024- 25 విద్యా సంవత్సరంలో 6వ తరగతికి సీబీఎస్ సిలబస్ కలిగి ఇంగ్లీషు మీడియంలో ప్రవేశాలకు ఈ నెల 13వ తేదీన నిర్వహించాల్సిన ప్రవేశ రాత పరీక్ష ఈ నెల 20వ తేదీకి వాయిదా వేసినట్టు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు సమీపంలో ఉన్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్స్ స్కూళ్లలో, లేదా 9491030243, 9491060948 ఫోన్ నంబర్లను సంప్రతించాలని ఆయన కోరారు.

సీపీఎస్‌పైనా చేతులెత్తేశారు!



అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో రద్దు చేస్తానని పాదయాత్రలో జగన్ హామీ

నాలుగేళ్లపాటు నాన్చి... చివరకు సాధ్యం కాదని ప్రకటించిన వైసీపీ ప్రభుత్వం

- కొత్తగా జీపీఎస్ విధానం
- నమ్మించి దగా చేశారని ఉద్యోగుల మండిపాటు
- జీపీఎస్ పేరుతో మరింత నష్టం తలపెట్టారంటూ ఆగ్రహం
- ఉమ్మడి జిల్లాలో సీపీఎస్ ఉద్యోగులు 30 వేల మంది



పాదయాత్రలో సీపీఎస్ ఉద్యోగులతో కలిసి నడుస్తున్న జగన్

విశాఖపట్నం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి):

కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) పరిధిలో పనిచేసే ఉద్యోగులను సీఎం జగన్మోహన్‌రెడ్డి నిలువునా మోసం చేశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతిపక్ష నేతగా చేసిన పాదయాత్రలో 'సీపీఎస్ రద్దు ఎంతసేపు... అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో చేస్తానన్న' అంటూ కొండంత హామీ ఇచ్చి... తీరా అధికారం చేపట్టిన తరువాత నాలుగేళ్లు నాన్చి, నాలుక మడతేశారు. చివరకు సీపీఎస్ రద్దు చేయలేనని... అంతకంటే గొప్ప పథకం అంటూ గ్యారంటీ పెన్షన్ స్కీమ్ (జీపీఎస్) తీసుకువచ్చారు. దీనిపై ఉద్యోగులు భగ్గుమంటున్నారు.



కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలిక ఊడిందన్న చందంగా మారింది రాష్ట్రంలోని సీపీఎస్ ఉద్యోగుల పరిస్థితి. అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో సీపీఎస్ రద్దు చేస్తానని పాదయాత్రలో జగన్ హామీ ఇవ్వడంతో మెజారిటీ ఉద్యోగులు గత ఎన్నికల్లో వైసీపీకి మద్దతుగా నిలిచారు. తీరా అధికారం చేపట్టాక నాలుగేళ్లు దానిపై మాట్లాడకుండా మౌనం దాల్చి... తీరిగ్గా రద్దు సాధ్యం కాదని తేల్చేసి...అంతకంటే మంచిదంటూ జీపీఎస్‌ను తెరపైకి తీసుకురావడంతో ఉద్యోగులంతా మండిపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఓపీఎస్ (పాత పింఛన్ విధానం) అమలే ఎజెండాగా ఉద్యమిస్తామంటున్నారు.

కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 2004 సెప్టెంబరు ఒకటో తేదీ నుంచి కాంట్రిబ్యూటర్ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)ను రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు అమలుచేశారు. అంటే ఆ తరువాత ప్రభుత్వ సర్వీసుల్లో చేరిన ఉద్యోగులకు సీపీఎస్ మేరకు పింఛన్ అందుతుంది. అంతకుముందు ఉద్యోగంలో చేరిన వారందరికీ పాత విధానం మేరకు పింఛన్‌తోపాటు ఆరోగ్య కార్డులు, ఇతర ప్రయోజనాలు లభిస్తాయి. ఈ నేపథ్యంలో సీపీఎస్‌పై ఉద్యోగులు ఆందోళనలకు దిగారు. ప్రతి ప్రభుత్వ హయాంలో పోరాటాలు చేశారు. సీపీఎస్‌కు ప్రత్యామ్నాయం ఇస్తామని 2014లో చంద్రబాబు భరోసా ఇచ్చినా ఉద్యోగులు మాత్రం 'సీపీఎస్' రద్దు తప్ప మరో మాటలేదని తేల్చిచెప్పారు. ఈ క్రమంలో రాష్ట్రంలో సీపీఎస్ ఉద్యోగుల సంఖ్య లక్షలకు చేరడంతో నిరసన స్వరం పెరిగింది.

పాదయాత్రలో మోసపూరిత హామీ

కాగా 2018లో పాదయాత్ర చేపట్టిన అప్పటి విపక్ష నేత జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వారంలో సీపీఎస్ రద్దు చేస్తానని హామీ ఇవ్వడంతో ఉద్యోగులంతా అతని అడుగులో అడుగువేసి పాదయాత్రలో వినతిపత్రాలు ఇచ్చి నీరాజనాలు పలికారు. గత ఎన్నికల్లో వైసీపీ విజయంలో కీలకభూమిక పోషించారు. తీరా అధికారంలోకి వచ్చిన తరువాత సీపీఎస్ రద్దుపై కేబినెట్‌లో చర్చించి కమిటీ వేశారు. తరువాత మరో రెండు కమిటీలు వేసినా రద్దు మాట మరిచిపోయారు. ఈ క్రమంలో ఉద్యోగులు చలో విజయవాడకు పిలుపునిచ్చారు. అయితే ఈ కార్యక్రమాన్ని అడ్డుకోవడానికి పోలీసులతో వైసీపీ ప్రభుత్వం గట్టిగా ప్రయత్నించినప్పుడే జగన్‌పై తమకు నమ్మకం పోయిందని ఆనందపురం మండలానికి చెందిన ఓ ఉపాధ్యాయుడు వ్యాఖ్యానించారు. సీపీఎస్ రద్దు మాట దేవుడెరుగు... సామాజిక మాధ్యమాల్లో వైసీపీ మూకలు తమపై విషం కక్కడం మరింత ఆవేదన కలిగించిందన్నారు. మంత్రులు, అధికారులతో పలు దఫాలు చర్చలు జరిపినా ఓపీఎస్ అమలు తప్ప మరేదైనా కోరుకోవాలనడం మోసం చేయడమేనని వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగి ఒకరు దుయ్యబట్టారు. చివరకు జీపీఎస్ అంటూ ఉద్యోగులకు నష్టం చేసేలా ఓ పథకాన్ని

... మిగతా 8వ పేజీలో

ఇళ్ల నిర్మాణానికి పైసా విదల్చని వైసీపీ సర్కారు

ప్రభుత్వ వైఖరితో నత్తనడకన జిల్లాలో ఇళ్ల నిర్మాణం

పూర్తిచేసిన ఇళ్ల లబ్ధిదారులకు రాష్ట్ర వాటా సొమ్ము జమకాని దుస్థితి

- జిల్లా వ్యాప్తంగా 17,111 ఇళ్లు మంజూరు
- శ్లాబ్ స్థాయిలో 2,561, పూర్తయినవి 1,589

(పాడేరు-ఆంధ్రజ్యోతి)

పేదలకు ఇళ్లు కట్టించి ఇస్తున్నామని గొప్పలు చెప్పుకొంటున్న జగన్ ప్రభుత్వం, అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నది. ఇంటి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రతి లబ్ధిదారునికి రూ.20 వేలు విడుదల చేయాల్సి ఉండగా, నిర్మాణాలు పూర్తయినా ఒక్క పైసా ఇవ్వని దుస్థితి కొనసాగుతున్నది. రాష్ట్ర ప్రభుత్వం ఇళ్ల లబ్ధిదారులను సంపూర్ణంగా ప్రోత్సహించకపోవడం వల్లే జిల్లాలో ఇళ్ల నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. లబ్ధిదారులకు కనీస ప్రోత్సాహం అందించకుండా 'పేదల సొంతింటి కల నెరవేరుస్తున్నాం' అనే అర్హత జగన్ ప్రభుత్వానికి ఉందా? అని పలువురు లబ్ధిదారులు సూటిగా ప్రశ్నిస్తున్నారు.

జిల్లాలోని 22 మండలాలకు ప్రధానమంత్రి ఆవాస యోజన(గ్రామీణ్)లో భాగంగా 17,111 మంది లబ్ధిదారులకు ఇళ్లు మంజూరయ్యాయి. అయితే రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా జిల్లా వ్యాప్తంగా ఇప్పటికి కేవలం 1,589 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. వైసీపీ ప్రభుత్వం ఇళ్ల నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి ఉంటే కేవలం ఏడాదిలోనే 17 వేల ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయవచ్చు. కానీ వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉండడంతో ఇప్పటికీ రెండు వేల ఇళ్లను పూర్తిచేయలేని పరిస్థితి నెలకొంది. అలాగే ఒక్కో లబ్ధిదారుడికి యూనిట్ ధర రూ. లక్షా 80 వేలు కాగా, దానిలో లక్షా 60 వేలు వరకు(మరుగుదొడ్డితో కలిపి) కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఆవాస యోజనలో అందిస్తుండగా, మిగిలిన రూ.20 వేలు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలి.



రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహం అందని జీకేవీధి మండలం దామునాపల్లిలో పూర్తయిన ఇల్లు



చింతపల్లి మండలం కొత్తపాలెంలో పూర్తయిన ఇల్లు

జిల్లాలో సబ్ డివిజన్ల వారీగా ఇళ్ల నిర్మాణాల స్థితిగతులు

సబ్‌డివిజన్ పేరు	మంజూరైన ఇళ్లు	శ్లాబ్ లెవల్	పూర్తయినవి
అరకులోయ	2,078	395	240
పెదబయలు	2,106	312	219
పాడేరు	2,657	488	239
చింతపల్లి	6,1,56	649	424
రంపచోడవరం	1,787	252	147
అడ్డతీగల	1,211	218	143
ఎటపాక	1,116	247	177
మొత్తం	**17,111**	**2,561**	**1,589**

రాష్ట్రం వాటా విడుదలపై నిర్లక్ష్యం

ఇళ్ల లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహకాన్ని అందించడంలో నిర్లక్ష్యం చూపుతోంది. నిబంధనల ప్రకారం లబ్ధిదారుడు ఇంటికి శ్లాబ్ వేసిన తరువాత రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహకమైన రూ.20వేలు విడుదల చేయాల్సి ఉండగా, ఇల్లు పూర్తయి గృహ ప్రవేశం జరిగి నెలల గడుస్తున్నా, ఆ రూ.20 వేలు అందని దుస్థితి నెలకొంది. అయితే ప్రభుత్వం (రాష్ట్ర) స్థాయిలోనే ఈ సమస్య ఏర్పడడంతో

... మిగతా 8వ పేజీలో

సమర్థంగా ఎన్నికల నిర్వహణ

విజయవంతం చేసే బాధ్యత ప్రిసైడింగ్ అధికారులదే

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.విజయ సునీత

పాడేరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికలను విజయవంతం చేసే బాధ్యత ప్రిసైడింగ్ అధికారులపైనే ఉందని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎం.విజయసునీత అన్నారు. స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలలో అరకులోయ అసెంబ్లీ స్థానం పరిధి హుకుంపేట మండలం, పాడేరు అసెంబ్లీ స్థానంలోని పాడేరు మండలాలకు చెందిన ప్రిసైడింగ్ అధికారులకు సోమవారం నిర్వహించిన మొదటి విడత ఒక రోజు శిక్షణా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఆత్మ విశ్వాసంతో ఎన్నికల విధులు నిర్వహించాలని, శిక్షణలో భాగంగా ఈవీఎంలు, వీవీప్యాట్, కంట్రోల్ యూనిట్ నిర్వహణ, 17ఎ రిజిస్టర్ ర్వహణపై పూర్తిగా అవగాహన పెంచుకుని పట్టు సాధించాలన్నారు. అలాగే అన్నీ తెలుసు, చాలా ఎన్నికలు నిర్వహించామని అనుకోకుండా ప్రతి అంశాన్ని సంపూర్ణంగా నేర్చుకోవాలన్నారు. ఎన్నికల నిర్వహణపై అందించిన పుస్తకాలను క్షుణ్ణంగా పదే పదే చదవాలని కలెక్టర్ సూచించారు. మనమంతా ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో విధులు నిర్వహిస్తున్నామనే విషయం గుర్తించుకుని అంకితభావంతో పని చేయాలని తెలిపారు.



ప్రిసైడింగ్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్ విజయ సునీత. చిత్రంలో ఆర్‌వోలు భావన, అభిషేక్ తదితరులు ఉన్నారు

విషయ పరిజ్ఞానం ముఖ్యం

ఎన్నికల నిర్వహణలో విషయ పరిజ్ఞానం ముఖ్యమని పాడేరు అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ భావనా వశిష్ఠ

... మిగతా 8వ పేజీలో

కొండ దారిలోనే ప్రసవం

రహదారి సౌకర్యం లేక గర్భిణిని చేతులతో మోసుకెళ్లిన గ్రామస్థులు

మార్గమధ్యంలో శిశువు జననం

అరకులోయ, ఏప్రిల్ 8: రహదారి సౌకర్యం లేకపోవడంతో గర్భిణిని గ్రామస్థులు చేతులతో మోసుకువెళుతుండగా ఆమె మార్గమధ్యంలో ప్రసవించింది. కొండ మార్గంలోనే పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఈ సంఘటన అనంతగిరి మండలం మారుమూల పెదకోట పంచాయతీ చీడివలసలో సోమవారం చోటుచేసుకుంది. వివరాలిలా వున్నాయి. చీడివలసకు చెందిన కిల్లో వసంతకు మూడో కాన్పు నొప్పులు సోమవారం వేకువజామున ప్రారంభమయ్యాయి. దీంతో ఆస్పత్రికి తరలించేందుకు కుటుంబ సభ్యులు 108 వాహనానికి ఫోన్ చేశారు. అయితే ఆ గ్రామానికి రోడ్డు సౌకర్యం లేక కిలోమీటరు దూరంలో అంబులెన్స్ ఆగింది. గర్భిణిని కొండ మార్గంలో గ్రామస్థులు చేతులతో మోసుకుని బయలుదేరారు. అయితే నొప్పులు ఎక్కువై ఆమె మార్గమధ్యంలోనే ప్రసవించింది. ఆడబిడ్డకు జన్మనిచ్చిన ఆమెకు ఎక్కువగా రక్తస్రావం కావడంతో అంబులెన్స్ సిబ్బంది ప్రథమ చికిత్స చేసి హుకుంపేట మండలం ఉప్ప పీహెచ్‌సీకి తరలించి వైద్య సేవలందించారు.



కాలినడకన గర్భిణిని ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం



మార్గమధ్యంలో జన్మించిన శిశువు

కొనసాగుతున్న ఎండ తీవ్రత

- చింతపల్లిలో 39.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత



పాడేరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మన్యంలో ఎండ తీవ్రత కొనసాగుతున్నది. గత మూడు రోజులతో పోలిస్తే సోమవారం కాస్త ఎండ ప్రభావం తగడంతో పాటు మబ్బులు సైతం పట్టాయి. అయినప్పటికీ ఉక్కపోత మాత్రం తగ్గలేదు. పెదబయలులో గరిష్ఠ ఉష్ణోగ్రత 37.7, కనిష్ఠ 19.8 డిగ్రీల సెల్సియస్ కాగా, హుకుంపేటలో 37.8- 20.3, జి.మాడుగులలో 35.8- 20.4, అనంతగిరిలో 34.0- 20.6, అరకులోయలో 35.8- 20.9, చింతపల్లిలో 39.4- 22.0, ముంచంగిపుట్టులో 36.8- 22.2 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు సోమవారం నమోదయ్యాయి.

జీతాల కోసం సీహెచ్‌డబ్ల్యూల నిరసన



ఐటీడీఏ కార్యాలయం వద్ద సీహెచ్‌డబ్ల్యూలతో కలిసి నిరసన తెలుపుతున్న ఆశా కార్యకర్తలు

పాడేరు రూరల్, ఏప్రిల్ 8: జిల్లాలో విధులు నిర్వహిస్తున్న సామాజిక ఆరోగ్య కార్యకర్తలు(సీహెచ్‌డబ్ల్యూ)కు మూడు నెలల బకాయి వేతనాలు చెల్లించాలని, పని భారం తగ్గించాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి డిమాండ్ చేశారు. సీహెచ్‌డబ్ల్యూల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఐటీడీఏ కార్యాలయం ప్రధాన గేటు వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీహెచ్‌డబ్ల్యూలకు వేతన బడ్జెట్ విడుదలైనప్పటికీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా మూడు నెలలుగా వేతనాలు లేక అవస్థలు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు, ఆశా యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై.మంగమ్మ, దాసమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కూటమికి మద్దతు తెలిపే అధికారులను బెదిరించడమే
స్టేట్ డైరెక్టరేట్ ఆఫ్ ఇంటెలిజెన్స్ లక్ష్యం

- అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్
- చోడవరం స్టేషన్‌లో విచారణకు హాజరు

-వార్త 9వ పేజీలో..

5,424 మద్యం బాటిళ్లు స్వాధీనం

జోలాపుట్టులో ఇద్దరిపై కేసు నమోదు

ముంచంగిపుట్టు, ఏప్రిల్ 8: మండలంలోని ఆంధ్ర, ఒడిశా సరిహద్దు ప్రాంతమైన జోలాపుట్టులో పోలీసులు 5,424 మద్యం క్వార్టర్ బాటిళ్లను ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి పోలీసులు సోమవారం తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. జోలాపుట్టులోని ఓ గొడౌన్‌లో మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయని పోలీసులకు సమాచారం అందింది. దీంతో జి.మాడుగుల సీఐ రమేశ్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్ఐ కె.రవీంద్ర, పోలీసులు మండలంలో గల జోలాపుట్టులో ఓ గొడౌన్‌పై ఆదివారం దాడి చేశారు. బస్తాల చాటున దాచి ఉంచి విక్రయాలు చేపడుతున్న సుమారు 113 మద్యం బాక్సులను పోలీసులు గుర్తించారు. ఒక్కో బాక్సులో 48 చొప్పున మొత్తం 5,424 మద్యం క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. మద్యం విక్రయాలు చేపడుతున్న వారణాసి మణికేశ్వరరావు, అతని కుమారుడు జగదీశ్‌పై ముంచంగిపుట్టు పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా నిందితులు పరారీలో ఉన్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (మంగళ)	6.15
సహరి (బుధ)	4.28

పిడుగుపాటుకు ఇద్దరి మృతి

ముంచంగిపుట్టు, ఏప్రిల్ 8: మండలంలో గల మారుమూల వనుగుమ్మ పంచాయతీ అసరాడ గ్రామ సమీపంలో కొండపై సోమవారం మధ్యాహ్నం పిడుగు పడి ఇద్దరు గిరిజనులు మృతి చెందారు. మృతి చెందిన ఇద్దరిలో ఒకరు అదే పంచాయతీ కిరంబో గ్రామానికి చెందిన పి.సుఖదేవ్‌గా, మరొకరు ఒడిశా మల్కన్‌గిరి జిల్లా జొడం పంచాయతీ పంపర్‌మెట్ట గ్రామానికి చెందిన జి.సీతారాంలుగా స్థానికులు గుర్తించారు. గ్రామ సమీపంలో కొండపై సుమారు 16 మంది జీడి తోటలు చుట్టూ మట్టి తవ్వే పనులను చేపడుతున్నారు. ఆ సమయంలో భారీ ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. కొంత మంది చెట్టు కింద తలదాచుకొనేందుకు వెళ్లారు. అదే సమయంలో సమీపంలో పిడుగు పడడంతో ఇద్దరు మృతి చెందారు. ఒడిశాకు చెందిన సీతారాం కిరంబో గ్రామానికి చుట్టపు చూపుగా వచ్చి పిడుగు పాటుకు మృతి చెందాడని స్థానికులు తెలిపారు. దీంతో ఆ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. జీడి తోటలకు కూలి పనికి వెళ్లి మృతి చెందిన ఇద్దరు గిరిజనులకు ప్రభుత్వం రూ.10 లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కె.శంకరరావు డిమాండ్ చేశారు.



సుఖదేవ్, సీతారాం మృతదేహాలు

చింతపల్లిలో ప్రత్యేక కరాటే శిబిరం

చింతపల్లి, ఏప్రిల్ 8: మండల కేంద్రంలో వేసవి ప్రత్యేక కరాటే శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు కోఫోకాన్ కరాటే జిల్లా ముఖ్య శిక్షకుడు బి.పాండురాజు తెలిపారు. ప్రతి ఏటా మాదిరిగా ఈ ఏడాది శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు, యువతీ, యువకులు ఆత్మరక్షణ, శరీర దృఢత్వం కోసం కరాటే శిక్షణ తీసుకోవాలని సూచించారు. ఈ వేసవి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి సమాచారం కోసం 9490997003, 9492817003 నంబర్లకు కాల్ చేయాలన్నారు.

ఎనీమియాపై బాలికలు అప్రమత్తంగా ఉండాలి

» ఇమ్యునైజేషన్ రాష్ట్ర అధికారి డాక్టర్ దేవి

చింతపల్లి, మార్చి 8: ఎనీమియాపై బాలికలు అప్రమత్తంగా ఉండాలని ఇమ్యునైజేషన్ రాష్ట్ర అధికారి, ఎనీమియా ముఖ్య భారత్ నోడల్ అధికారి డాక్టర్ దేవి సూచించారు. చింతపల్లి, గూడెంకొత్తవీధి మండలాల్లో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి సాధనతో కలిసి సోమవారం ఆమె పర్యటించారు. లంబసింగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, చింతపల్లి, జీకే వీధి గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఆశ్రమ పాఠశాలల విద్యార్థినులతో డాక్టర్ దేవి సమావేశమయ్యారు. ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థినుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని మాస్ హెచ్‌బీ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థినులు రక్తహీనతతో బాధపడుతున్నట్టు పరీక్షల ద్వారా నిర్ధారణ జరిగితే మంచి మందులు పంపిణీ చేస్తామన్నారు. వాటిని క్రమంగా వాడుతూ పోషకాహారం తీసుకోవాలని చెప్పారు. రక్తహీనతపై ఏమాత్రం నిర్లక్ష్యం చేయరాదన్నారు. రక్తహీనత కలిగిన విద్యార్థినులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. బాలికలకు ప్రత్యేక ఆహారం పెట్టడంతో పాటు వారి ఆరోగ్యాన్ని ఉపాధ్యాయులు రోజూ పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. ఆరోగ్యంలో మార్పు కనిపిస్తే వెంటనే ఆస్పత్రికి తీసుకు వెళ్లాలన్నారు. అలాగే వైద్య సిబ్బంది, పారామెడికల్ ఉద్యోగులతో మాట్లాడుతూ గ్రామాల్లో చిన్నారులు, గర్భిణులకు క్రమంగా టీకాలు వేయాలని ఆదేశించారు. వేక్సినేషన్ చేయడంతో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డాక్టర్ దేవి హెచ్చరించారు. పీహెచ్‌సీలో వ్యాక్సిన్ భద్రపర్చేందుకు వైద్యులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌వీ నగర్ వైద్యులు కె.సౌమ్య, రాజ, హెచ్‌ఎం జేపీ కొండలరావు, హెచ్‌డబ్ల్యూవో నూకరత్నం పాల్గొన్నారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఇమ్యునైజేషన్ అధికారి దేవి

రాష్ట్రం కోసం ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలి

» పాడేరు అసెంబ్లీ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేవీ.రమేశ్‌నాయుడు

పాడేరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మెరుగైన పాలన కోసం బీజేపీ, టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేవీ.రమేశ్‌నాయుడు పిలుపునిచ్చారు. బీజేపీ మైనార్టీ మోర్చా ఆధ్వర్యంలో మండలంలోని ఓనూరు, నందిగరువు గ్రామాల్లో సోమవారం పర్యటించి గిరిజనులను కలిసి మాట్లాడారు. వైసీపీ పాలనతో రాష్ట్రం అన్ని విధాలా నష్టపోయిందని, అందువల్ల బీజేపీ, టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం వస్తేనే రాష్ట్రం బాగుపడుతుందని పేర్కొన్నారు. ప్రజలంతా వాస్తవాలను గ్రహించాలని, వైసీపీ మాయమాటలను నమ్మకుండా ఉమ్మడి ప్రభుత్వాన్ని గెలిపించాలని కోరారు. ప్రధానంగా జగన్ పాలనలో గిరిజనుల హక్కులు, చట్టాలు సక్రమంగా అమలు కాలేదన్నారు. ప్రజలకు న్యాయం జరగాలన్నా, సమాజం బాగుపడాలన్నా, రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా ఉమ్మడి ప్రభుత్వంతోనే సాధ్యమని రమేశ్‌నాయుడు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత అడపా నరసింహమూర్తినాయుడు, బీజేపీ నేతలు పెనుమాక రవికుమార్, సల్లా రామకృష్ణ, కూడ కృష్ణారావు, కె.వెంకటరమణ, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



ఓనూరులో గిరిజనులతో మాట్లాడుతున్న రమేశ్‌నాయుడు, బీజేపీ నాయకులు

అరకు సీపీఎం ఎంపీ అభ్యర్థిగా అప్పలనర్స

» అరకు ఎమ్మెల్యే అభ్యర్థిగా దీసరి గంగరాజు ఎంపిక

పాడేరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): అరకులోయ పార్లమెంట్, అసెంబ్లీ స్థానాలకు సంబంధించి సీపీఎం తమ అభ్యర్థులను సోమవారం ప్రకటించింది. అరకులోయ ఎంపీ అభ్యర్థిగా పి.అప్పలనర్స, ఎమ్మెల్యే అభ్యర్థిగా డి.గంగరాజు పేర్లను సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రకటించారు. అరకులోయ ప్రాంతానికి చెందిన పి.అప్పలనర్స ఎస్ఎఫ్ఐ నేత స్థాయి నుంచి సీపీఎం అనుబంధ సంఘాల్లో పనిచేస్తూ నేడు గిరిజన సంఘం జాతీయ సభ్యుడిగా పనిచేస్తున్నారు. దీంతో అతన్ని అరకు ఎంపీ అభ్యర్థిగా ఎంపిక చేశారు. అలాగే సీపీఎం నేతగా సుదీర్ఘ కాలంగా పనిచేస్తూ ప్రస్తుతం అనంతగిరి జడ్పీటీసీ సభ్యుడిగా ఉన్న దీసరి గంగరాజును అరకులోయ ఎమ్మెల్యే బరిలోకి దింపారు. ఇద్దరు అభ్యర్థులు గిరిజన ప్రాంత సమస్యలపై ఉద్యమిస్తూ ప్రజలకు సుపరిచితులు కావడంతో వారికి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎంపిక చేసినట్టు సీపీఎం నేతలు తెలిపారు.



అప్పలనర్స... దీసరి గంగరాజు

రంపచోడవరం ఎమ్మెల్యే అభ్యర్థిగా లోతా రామారావు

రంపచోడవరం సీపీఎం ఎమ్మెల్యే అభ్యర్థిగా లోతా రామారావు పేరును ఆ పార్టీ అధిష్ఠానం సోమవారం ఖరారు చేసింది. రాజవొమ్మంగి మండలం లోదొడ్డి పంచాయతీ కేశవరం గ్రామానికి చెందిన లోతా రామారావు ప్రస్తుతం గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా, రాజవొమ్మంగి మండలం లోదొడ్డి సర్పంచ్‌గా ఉన్నారు. గత కొన్నేళ్లుగా ప్రజా సమస్యలపై గిరిజన సంఘం, సీపీఎం తరఫున రామారావు పోరాటాలు చేస్తున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ పొత్తులో భాగంగా రంపచోడవరం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా రామారావు పోటీ చేయనున్నారు.

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ



వారపు సంతలో ర్యాలీ చేస్తున్న తహసీల్దార్, రెవెన్యూ ఉద్యోగులు, విద్యార్థులు

చింతపల్లి, ఏప్రిల్ 8: మండలంలోని అన్నవరం వారపు సంతలో ఓటు హక్కుపై సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. రెవెన్యూ ఉద్యోగులు, విద్యార్థులు, ఆశా కార్యకర్తలు ఓటు ప్రాముఖ్యతను వివరిస్తూ ర్యాలీ సాగించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ టి.రామకృష్ణ మాట్లాడుతూ రాజకీయ పార్టీలు, నాయకుల ప్రలోభాలకు తలొగ్గకుండా మంచి నాయకుడ్ని ఎన్నుకునేందుకు ఓటు వేయాలన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ఓటు చాలా విలువైందన్నారు. కొత్తగా ఓటు హక్కు నమోదు చేసుకునేందుకు ఎన్నికల కమిషన్ మరో అవకాశం కల్పించిందని, 18 ఏళ్లు నిండిన వారంతా ఈ నెల 15వ తేదీలోగా ఫారం-6 దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కృష్ణమూర్తి, ఈవోపీఆర్‌డీ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జోగంపేటలో జీడిమామిడి తోట దగ్ధం



అగ్ని ప్రమాదంలో దగ్ధమైన జీడిమామిడి తోట.. బాధితులు

కొయ్యూరు, ఏప్రిల్ 8: మండలంలోని రాజేంద్రపాలెం పంచాయతీ జోగంపేటకు గ్రామంలో జీడిమామిడి తోట దగ్ధమైంది. సోమవారం ఉదయం బాధిత రైతులు జీడిమామిడి తోటలో ఫలసాయం ఏరుకునేందుకు వెళ్లగా సుమారు రెండు ఎకరాల తోట అగ్నికి ఆహుతైనట్టు గుర్తించారు. అటవీ హక్కుల చట్టంలో భార్య పూసే పేరున పట్టా పొంది ఆరుగాలం కష్టపడి సాగు చేసిన జీడిమామిడి తోట ఫలసాయం చేతికందొచ్చే క్రమంలో అగ్నికి ఆహుతైందని బాధిత రైతు కన్నీరుమున్నీరుగా విలపించారు. ప్రభుత్వం స్పందించి తిరిగి తోటను పెంచుకునేందుకు తమకు ఆర్థికంగా తగిన సహాయ సహకారాలు అందించాలని బాధిత రైతులు గెమ్మెలి కామేశ్వరరావు, పూసే వేడుకున్నారు.

ఇళ్ల నిర్మాణానికి పైసా విదల్చని వైసీపీ సర్కారు

... 7వ పేజీ తరువాయి

అధికారులు, లబ్ధిదారులు సైతం మిన్నకుండడం మినహా ఏమీ చేయలేని పరిస్థితి ఉంది. కొన్నాళ్లు హౌసింగ్ కార్యాలయం చుట్టూ తిరిగిన లబ్ధిదారులు ఇక ఆ డబ్బులు రావని భావించి అధికారులను వాటిని గురించి అడగడం మానేశారు. జిల్లాలో శ్లాబ్ లెవల్‌లో 2,561 ఇళ్లతోపాటు నిర్మాణం పూర్తయిన 1,589 ఇళ్లకు సంబంధించిన మొత్తం 4,150 మంది లబ్ధిదారులకు రూ. 20 వేలు చొప్పున రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహక సొమ్ము అందాల్సి ఉంది. ఈ పరిస్థితులే ఇళ్ల లబ్ధిదారులకు వైసీపీ జగన్ సర్కారు అందిస్తున్న ప్రోత్సాహం ఎలా ఉందో స్పష్టం చేస్తున్నది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ ప్రోత్సాహక సొమ్మును విడుదల చేయాలని ఇళ్ల లబ్ధిదారులు కోరుతున్నారు.

టికెట్ కేటాయింపుపై అధిష్ఠానం పునరాలోచించాలి

» టీడీపీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి దొన్నుదొర

అరకులోయ, ఏప్రిల్ 8: అరకులోయ అసెంబ్లీ టికెట్ కేటాయింపుపై అధిష్ఠానం పునరాలోచించాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర కోరారు. నియోజకవర్గం పరిధిలోని ఆరు మండలాల పార్టీ ముఖ్య నాయకులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గెలవని పార్టీకి పొత్తులో భాగంగా అరకు టికెట్ కేటాయిస్తే తామంతా ఎలా పనిచేయగలమని ప్రశ్నించారు. అరకుకు బదులు మైదాన ప్రాంతంలో బీజేపీకి బలం ఉన్న చోట టికెట్ కేటాయిస్తే ప్రయోజనం ఉంటుందన్నారు. ఇప్పటికే పార్టీ పెద్దలకు తమ అభిప్రాయం వెల్లడించామని, మరోమారు విజ్ఞప్తి చేస్తున్నామని చెప్పారు. హైకమాండ్ నిర్ణయంలో మార్పు లేకుంటే కేడర్ నిర్ణయం మేరకు భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని దొన్నుదొర పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆరు మండలాల నాయకులు శెట్టి బాబూరావు, పాంగి బలరాం, వెచ్చంగి కొండయ్య, అర్మ బొర్రా, సుబ్బారావు, పెట్టెలి దాసుబాబు, జన్ని అప్పారావు, ఒంబి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దొన్నుదొర

కన్నుల పండువగా ధారాలమ్మ పండుగ

సీలేరు, ఏప్రిల్ 8: ధారాలమ్మ 58వ వార్షిక మహోత్సవాల్లో సోమవారం అమ్మవారి ప్రధాన పండుగను కన్నుల పండువగా నిర్వహించారు. వివిధ ప్రాంతాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులను తీర్చుకున్నారు. ధారకొండ గ్రామస్థులు తెల్లవారుజామున పసుపు, కుంకుమతో సారెను ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. అమ్మవారి పట్టానివేదన కార్యక్రమం సందర్భంగా ఆలయ ఈవో సాంబశివరావు, ఆలయ కమిటీ కార్యవర్గ సభ్యులు నాగేశ్వరరావు, విష్ణుమూర్తి, రామారావు తదితరులు చీర, సారెలతో పాటు పట్టాపోతును సమర్పించారు. సాయంత్రం నాలుగు గంటలకు అమ్మవారి తలుపులను మూసివేశారు. భక్తులకు అన్నసమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మంగళవారం ఉదయం గుడి తలుపులు తెరిచి యథావిధిగా భక్తులకు దర్శనం కల్పిస్తామని ఈవో సాంబశివరావు తెలిపారు.



పసుపు కుంకుమలతో ఊరేగింపు వెళ్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో నూకాలమ్మ జాతర

సీలేరులో నూకాలమ్మ జాతరను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జలవిద్యుత్ కేంద్రం వద్ద ఆలయంలోని అమ్మవారిని ఉత్సవ కమిటీ ప్రతినిధులు గజమాల, వివిధ పూలతో అలంకరించారు. సీలేరు ఏపీ జెన్‌కో ఇంజనీర్ బుద్దాన రమేష్‌కుమార్ దంపతులు అమ్మవారికి పట్టుచీర, సారెను సమర్పించారు. సీలేరు పరిసర గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులను తీర్చుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మధ్యాహ్నం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు.



నూకాలమ్మ దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కొయ్యూరు, ఏప్రిల్ 8: కొయ్యూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2000-21 విద్యా సంవత్సరంలో చదివిన పదో తరగతి విద్యార్థులు సోమవారం ఆత్మీయంగా కలుసుకున్నారు. పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వేర్వేరు ప్రాంతాల్లో స్థిర పడిన వారంతా కలుసుకుని జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అనంతరం విందు ఏర్పాటు చేసుకున్నారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేసేందుకు నిర్ణయించుకుని, అందుకు అవసరమైన సహకారం ఎలా ఇవ్వాలనే విషయమై చర్చించుకున్నారు. అలాగే బ్యాచ్‌లో ఎవరు ఇబ్బందులు పడ్డా ఒకరికొకరు సహకరించుకునేందుకు వీలుగా గ్రూప్ ఏర్పాటు చేసుకున్నట్టు తెలిపారు.

సీపీఎస్‌పైనా చేతులెత్తేశారు!

... 7వ పేజీ తరువాయి

తమ నెత్తిన మోపారని మండిపడ్డారు. సీపీఎస్ ప్రకారం సర్వీస్‌లో చివరకు దాచుకున్న మొత్తంలో సగం ఉద్యోగి చేతికి ఇచ్చి, మిగిలిన సగంపై వచ్చే లాభమే పింఛన్‌గా వస్తుందని మరో టీచర్ వివరించారు. జీపీఎస్ వల్ల ఉద్యోగి దాచుకున్న సొమ్ము మొత్తం ప్రభుత్వమే తీసుకుని దానిని పెట్టుబడుల్లో పెడితే వచ్చే లాభం పింఛన్‌గా తీసుకోవాలన్నారు. అంటే ఉద్యోగ విరమణ అనంతరం ఒట్టి చేతులతో ఇంటికి వెళ్లిపోవడమేనన్నారు.

టక్కర్ ఆహ్వానాన్ని తిరస్కరించి...

తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఫ్యామిలీ పింఛన్, గ్రాట్యుటీ ప్రయోజనం కల్పించారు. అయితే పాత విధానమే మేలని ఉద్యోగులు పట్టుబట్టారు. ఎస్పీ టక్కర్ కమిటీ ఆహ్వానించినా వెళ్లలేదు. ఈ దశలో పాదయాత్ర చేపట్టిన జగన్ సీపీఎస్ రద్దు హామీ ఇచ్చారు. జగన్ హామీ నిలబెట్టుకుంటారని నమ్మి టక్కర్ ఆహ్వానాన్ని తిరస్కరించామని ఓ ప్రభుత్వ ఉద్యోగి ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం మోసం చేస్తారని తాము భావించలేదని వాపోయారు. ప్రభుత్వమే మోసం చేయడంతో ఉమ్మడి జిల్లాలో సుమారు 30 వేల మంది ఉద్యోగులు నష్టపోతున్నారన్నారు.

సమర్థంగా ఎన్నికల నిర్వహణ

... 7వ పేజీ తరువాయి

అన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనేవారికి సంపూర్ణ విషయ పరిజ్ఞానాన్ని అందించేందుకు మాస్టర్ ట్రైనర్లు కృషి చేయాలన్నారు. ఎన్నికల కమిషన్‌కు సంబంధించిన మొబైల్ యాప్‌లపై శిక్షణ ఇచ్చి, అవగాహన పెంచాలన్నారు. పోలింగ్ నిర్వహణపై రూపొందించిన వీడియోల వీక్షణతో అవగాహన పెరుగుతుం దన్నారు. పోలింగ్ కేంద్రాల్లో రహస్య ఓటింగ్‌కు అవసరమైన ఏర్పాట్లు సక్రమంగా నిర్వహించాలని, పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్‌కు ఏర్పాట్లు చేస్తామన్నారు. ఈ సందర్భంగా అరకులోయ అసెంబ్లీ స్థానిక రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీవో వి.అభిషేక్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో ప్రిసైడింగ్ అధికారుల పాత్ర కీలకమన్నారు. ఓటరు కంపార్టుమెంట్‌లోకి వెళ్లి ఓటు వేసిన తరువాత బీప్ శబ్దం వస్తుందని, దానిని తప్పనిసరిగా పీవో వినాలని ఆయన సూచించారు. పోలింగ్ కేంద్రంలో ఉన్న మొత్తం సిబ్బంది సమన్వయంతో పని చేయాలన్నారు. ఓటరు చెక్ లిస్టు, పీవో డైరీ సక్రమంగా నిర్వహించాలని, అవసరం మేరకు సెక్టార్ అధికారుల వద్ద రెండు ఈవీఎంలు రిజర్వులో ఉంటాయని, ఎక్కడైనా ఈవీఎంలు పని చేయకపోతే వెంటనే మార్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పద్మావతి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వీవీఎస్ శర్మ, స్థానిక తహసీల్దార్ టి.కల్యాణచక్రవర్తి, అరకులోయ తహసీల్దార్ సోమేశ్వరరావు, మాస్టర్ ట్రైనర్లు, సెక్టార్ అధికారులు, 423 మంది ప్రిసైడింగ్ అధికారులు పాల్గొన్నారు.

☛ సంక్షిప్తంగా..

'కాఫీ ప్రోత్సాహక సొమ్ము చెల్లించని వైసీపీని ఓడించాలి'

డుంబ్రిగుడ, ఏప్రిల్ 8: కాఫీ ప్రోత్సాహక నిధులు రైతులకు ఇవ్వకుండా మోసం చేసిన వైసీపీని సార్వత్రిక ఎన్నికల్లో ఓడించాలని మాజీ సర్పంచ్ సురేష్ పిలుపునిచ్చారు. మండలంలోని కితలంగి పంచాయతీ బిల్లాపుట్టు గ్రామంలో సీపీఎం నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాఫీ రైతులకు అందాల్సిన ప్రోత్సాహక నిధులు రూ.60 కోట్లు ఇవ్వకుండా ప్రభుత్వం మోసం చేసిందన్నారు. గ్రామ పంచాయతీలకు నిధులను దారి మళ్లించి స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసి అభివృద్ధి కార్యక్రమాలను తుంగలో తొక్కిందని చెప్పారు. ఇంత చేసిన వైసీపీకి ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు.గిరిజన చట్టాలు, హక్కులు సాధించుకోవాలన్న సీపీఎం ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు సూర్యనారాయణ, సత్యనారాయణ, మోహనరావు, దేవగున్, మహేష్, నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ఉగాది వేడుక

చింతపల్లి, ఏప్రిల్ 8: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉగాది వేడుకను విద్యార్థులు, అధ్యాపకులు ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులకు సంప్రదాయ వస్త్రధారణ, ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. విద్యార్థులు స్వయంగా సిద్ధంచేసిన ఉగాది పచ్చడిని పలువురికి పంపిణీ చేశారు. ఉగాది పండుగను తెలుగు ప్రజలు అంత్యత వైభవంగా జరుపుకోవాలని ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎం.విజయభారతి కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాసపాత్రుడు, కె.లీలాపావని, జి.జగదీశ్‌బాబు, కె.బాలరాజు, టి.జగత్‌రాయ్, ఎం.నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బ్రెయిన్ స్ట్రోక్‌తో ఆర్‌కే టైలర్స్ యజమాని రాజు మృతి

పాడేరు రూరల్, ఏప్రిల్ 8: అల్లూరి జిల్లా పద్మశాలి సేవా సంఘం ప్రతినిధి, ఆర్‌కే టైలర్స్ యజమాని ఆర్‌కే రాజు బ్రెయిన్ స్ట్రోక్‌తో ఆదివారం సాయంత్రం మృతి చెందారు. కేజీహెచ్ నుంచి రాజు మృతదేహాన్ని సోమవారం పాడేరుకు తరలించగా, పద్మశాలి కార్పొరేషన్ చైర్‌పర్సన్ జింక విజయలక్ష్మి, ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, టైలర్స్, పద్మశాలి, వర్తక సంఘాల ప్రతినిధులు, రాజకీయ నాయకులు, విలేకరులు రాజుకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మోదకొండమ్మ ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి సింహాచలంనాయుడు మాట్లాడుతూ దైవ కార్యక్రమాల్లో ఎంతో భక్తిశ్రద్ధలతో చురుకుగా పాల్గొనే రాజు మృతి సేవా కార్యక్రమాల ప్రతినిధులకు తీరని లోటన్నారు.

మొండిగెడ్డ ఉప సర్పంచ్ మృతి

సకాలంలో వైద్యం అందుకేనని కుటుంబీకుల ఆరోపణ

గూడెంకొత్తవీధి, ఏప్రిల్ 8: మండలంలోని మొండిగెడ్డ పంచాయతీ ఉప సర్పంచ్ గబులంగి సత్యనారాయణ (56) ఆదివారం రాత్రి మృతి చెందారు. జర్రెల పీహెచ్‌సీలో సకాలంలో వైద్యం అందక పోవడంతోనే అతను మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు, సర్పంచ్ ప్రియాంక ఆరోపించారు. సత్యనారాయణ ఆదివారం రాత్రి ఛాతిలో నొప్పి వస్తున్నదని చెప్పడంతో ఆటోలో జర్రెల పీహెచ్‌సీకి తీసుకువెళ్లామని, స్టాఫ్ నర్సు మాత్రమే ఉన్నారని, వైద్యాధికారి ఫోన్‌లో మాట్లాడేందుకు కూడా అందుబాటులో లేదని వారు చెప్పారు. దీంతో పరిస్థితి ఆందోళనకరంగా ఉందని, వెంటనే చింతపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించాలని స్టాఫ్ నర్సు సూచించారన్నారు. అంబులెన్సు కూడా అందుబాటులో లేకపోవడంతో రాత్రి 9 గంటలకు ఆటోలో చింతపల్లి తరలించేందుకు ఏర్పాట్లు చేస్తుండగా సత్యనారాయణ మరణించారని వారు తెలిపారు. అంబులెన్సు అందుబాటులో ఉండి, ఆస్పత్రికి వచ్చిన వెంటనే చింతపల్లి తరలించి వుంటే బతికేవారన్నారు. వైద్య సిబ్బంది నిర్లక్ష్యం, అంబులెన్సు అందుబాటులో లేకపోవడంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్టు బాధిత కుటుంబీకులు తెలిపారు.




సత్యనారాయణ (ఫైల్)

వ్యవసాయ ఉత్పత్తులపై అవగాహన పెంచుకోండి

హుకుంపేట, ఏప్రిల్ 8: వ్యసాయ ఉత్పత్తుల సాగుపై రైతులు పూర్తిగా అవగాహన పెంచుకోవాలని వ్యవసాయ పరిశోధకుడు ముకుందరావు సూచించారు. మండలంలోని సూకురు చట్రాయిపుట్టు గ్రామంలో సోమవారం రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ సహకారంతో గోడను నిర్మించి ప్రారంభించారు. ఈ సందర్భంగా అనకాపల్లి ప్రాతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఉప ప్రణాళిక నిధులు, జీవన నియంత్రణ పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు పండించే ప్రతీ పంటను గిట్టుబాటు ధర పలికినపుడు మాత్రమే విక్రయించుకోవాలని సూచించారు. పసుపు, మిరియాలు, పిప్పళ్లు తదితర పంటలను యంత్రాలు ఉపయోగించి నాణ్యతతో పండించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు అనిల్‌కుమార్, నాయకులు కొంబాబు రమేష్, మౌక్తిక, రైతులు పాల్గొన్నారు

చింతలవీధి నూకాంబిక అమ్మవారికి ప్రత్యేక పూజలు



పాడేరు రూరల్, ఏప్రిల్ 8: చింతలవీధి పంచాయతీ కేంద్రంలో కొలువైన నూకాంబిక అమ్మవారికి ఆలయ కమిటీ ప్రతినిధులు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్త అమావాస్యను పురస్కరించుకొని ఉదయం నుంచి ఆలయ అర్చకులు ఎన్ఎస్.ప్రసాద్‌శర్మ అమ్మవారికి అర్చనలు చేశారు. పంచాయతీ పరిధిలోని వివిధ గ్రామాల నుంచి వందలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఆలయ కమిటీ ప్రతినిధులు సోమవారం మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు. వందలాది మంది భక్తులు అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు.

క్రైం... crime news

గడ్డి మందు తాగిన వ్యక్తి మృతి


మృతుడు శివ (ఫైల్)

గొలుగొండ, ఏప్రిల్ 8 : అప్పుల బాధ తట్టుకోలేక గడ్డి మందు తాగి ఆస్పత్రిలో చికిత్సలు పొందుతున్న వ్యక్తి మృతిచెందినట్టు ఎస్‌ఐ కృష్ణారావు తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయన కథనం ప్రకారం వివరాలివి. మండలంలోని పాతమల్లంపేట శివారు ద్వారకా నగరం గ్రామానికి చెందిన రాయపురెడ్డి శివ(40) ఆర్థిక ఇబ్బందులు కారణంగా అప్పులు చేశాడు. వాటిని తీర్చే మార్గం లేక సుమారు ఇరవై రోజుల క్రితం గడ్డి మందు తాగాడు. ఇది గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే అతనిని నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి వైద్యులు ప్రాథమిక చికిత్సల అనంతరం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్సలు పొందుతూ సోమవారం ప్రాణాలు విడిచినట్టు ఎస్‌ఐ చెప్పారు. మృతుడి భార్య అమ్మాజీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

విశాఖపట్నం, ఏప్రిల్ 8: తమకు పిల్లలు పుట్టకపోవడంతో పాటు ఇటీవల తండ్రి మృతి చెందడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు మండలం వెంకటాపురానికి చెందిన ఎ.సూర్యారావు (42) భార్య మణితో కలిసి అగనంపూడి సమీపంలోని కొండయ్య వలసలో నివాసం ఉంటున్నారు. సూర్యారావు అచ్యుతాపురంలోని ఓ ఫార్మా కంపెనీలో అసిస్టెంట్ మేనేజర్‌గా పని చేస్తున్నారు. కాగా ఈ నెల ఐదున తండ్రి మృతి చెందడంతో సూర్యారావు భార్య మణితో కలిసి తమ స్వగ్రామం వెళ్లారు. ఆదివారం సూర్యారావు ఒక్కరే ఇక్కడకు చేరుకోవడంతో పాటు రాత్రి ఏడున్నరప్పుడు భార్యతో ఫోన్‌లో మాట్లాడారు. అయితే సోమవారం ఉదయం ఎంతసేపటికీ సూర్యారావు తలుపులు తెరవకపోవడంతో ఇరుగు పొరుగు వాళ్లు వచ్చి చూసే సరికి ఆయన ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించారు. దీంతో స్థానికులు దువ్వాడ పోలీసులకు, మణికి ఫోన్‌లో సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సూర్యారావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న కారు : ఇద్దరు మృతి

యలమంచిలి, ఏప్రిల్ 8: పశ్చిమ గోదావరి యలమంచిలి మండలం కాజ తూర్పు గ్రామ పరిధిలోని జాతీయ రహదారిపై సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో పూడి అప్పారావు (55), కడియాలు పెదమునియ్య (41) మృతి చెందినట్లు ఎస్‌ఐ కె.శివన్నారాయణ తెలిపారు. విశాఖ జిల్లా నక్కపల్లి మండలం ఉప్మాక అగ్రహారం గ్రామానికి చెందిన పూడి అప్పారావు, చిన ఆనర్ల గ్రామానికి చెందిన కడియాలు పెదమునియ్య కొబ్బరి దింపుకార్మికులుగా పనిచేస్తూ జీవనోపాధి నిమిత్తం పదేళ్లుగా నుంచి అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం గుడిమెళ్లంకలో నివాసం ఉంటున్నారు. పాలకొల్లులో కొబ్బరి దింపు తీసేందుకు అప్పారావు, పెద మునియ్యలు బైక్‌పై సోమవారం ఉదయం గుడిమెళ్లంక నుంచి వస్తుండగా కాజ వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టడంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడు అప్పారావు కుమారుడు అప్పలరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

12 మద్యం బాటిళ్లు స్వాధీనం

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 8 : స్థానిక మెయిన్‌రోడ్డులో ఒక వ్యక్తి నుంచి సోమవారం 12 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు పట్టణ హెడ్‌కానిస్టేబుల్ బి. రామకృష్ణ తెలిపారు. బుచ్చెయ్యపేట మండలం శివరామపురం గ్రామానికి చెందిన నమ్మి సత్యారావు పట్టణంలోని మద్యం దుకాణాల్లో 12 మద్యం బాటిళ్లు కొనుగోలు చేసి తీసుకువెళుతుండగా మల్లిమ ఋగుల వారి వీధి జంక్షన్ వద్ద అదుపులోకి తీసుకుని బాటిళ్ల స్వాధీనం చేసుకున్నామన్నారు.

లూలూరులో ఆరు ఎకరాల జీడితోట దగ్ధం


అగ్ని ప్రమాదంలో దగ్ధమైన జీడితోట

బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 8 : విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మండలంలోని లూలూరు రెవెన్యూ పరిధిలో సోమవారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఆరు ఎకరాల జీడితోట దగ్ధం కావడంతో సుమారు రూ.10 లక్షల వరకు పంట నష్టం సంభవించింది. ఎల్.సింగవరం గ్రామ మాజీ సర్పంచ్ కరణం కాసులమ్మ ఆరు ఎకరాల జీడితోట సాగు చేస్తున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు వ్యవసాయ బోరుకు విద్యుత్‌ను సరఫరా చేసే వైర్ల నుంచి షార్ట్ సర్క్యూట్ కారణంగా నిప్పురవ్వలు తోటలోని ఎండుటాకులపై పడ్డాయి. దీంతో మంటలు చెలరేగాయి. అదే సమయంలో గాలులు వీచడంతో సమీప రైతులు మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ తోట మొత్తం అగ్నికి ఆహుతైయింది. ఈ సమాచారం అందుకున్న రావికమతం అగ్నిమాపక కేంద్రం సిబ్బంది వచ్చినప్పటికీ ఘటనా స్థలానికి చేరుకునేందుకు రహదారి సౌకర్యం లేకపోవడంతో వారు వెనుదిరిగారు. టీడీపీ చోడవరం నియోజకవర్గం ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబు సదరు జీడీతోటను పరిశీలించి, బాధిత రైతు కాసులమ్మతో మాట్లాడారు. లోపూడి సచివాలయం వీఏఏ బ్లెసీ ప్రమాదం వివరాలను సేకరించారు.

ఇరవై అడుగుల గిరినాగు హతం



నాతవరం, ఏప్రిల్ 8 : మండలం లోని మాధవనగరంలో సోమవారం ఇరవై అడుగుల పొడవున్న గిరినాగును గ్రామస్థులు హతమార్చారు. కొండపక్కనే ఉన్న ఈ గ్రామంలో గల పూరింటిలోకి ఈ పాము ప్రవేశించింది. దానిని చూసినవారంతా హడలిపోయారు. అక్కడి నుంచి ఎంత అదిరించినా వెళ్లకపోవడంతో చివరకు చేసేది లేక ప్రాణభయంతో కర్రలతో హతమార్చారు. ఈ పామును చూసేందుకు జనం ఎగబడ్డారు.

తగ్గిన ఉష్ణోగ్రతలతో జనం ఉపశమనం

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 8 : గత నాలుగు రోజులుగా పట్టణ ప్రజలను అల్లాడిస్తున్న ఉష్ణోగ్రతలు సోమవారం ఒక్కసారిగా తగ్గుముఖం పట్టాయి. శనివారం 39.8 డిగ్రీలు అత్యధిక ఉష్ణోగ్రత నమోదు కాగా ఆదివారం 38.8 డిగ్రీలు నమోదైంది. సోమవారం ఒక్కసారిగా 34.8 డిగ్రీలకు తగ్గిపోయింది. ఒక్క రోజులో నాలుగు డిగ్రీల ఉష్ణోగ్రత తగ్గడంతో ప్రజలు ఉపశమనం పొందారు. ఉదయం నుంచి చిన్నపాటి మేఘం మాదిరిగా వాతావరణమంతా నీడను తలపించింది. దీంతో ప్రజలు కూడా రోడ్డెక్కి వారి పనులను చేసుకునేందుకు అవకాశం లభించింది. సాయంత్రం కూడా ఉష్ణోగ్రతలు చల్లబడడంతో ప్రజలు ఉపశమనం పొందారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	130.00
లైవ్ ధర	150.00
విత్ స్కిన్	270.00
స్కిన్ లెస్	280.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	405
విజయనగరం	409
శ్రీకాకుళం	409

కూటమికి మద్దతిస్తే బెదిరింపులు

- స్టేట్ డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ లక్ష్యం ఇదే..
- అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ ఆరోపణ
- చోడవరం స్టేషన్‌లో విచారణకు హాజరు
- అధికారుల పట్ల తాము అమర్యాదకరంగా ప్రవర్తించలేదని వివరణ


డీఎస్పీ అప్పలరాజుతో మాట్లాడుతున్న సీఎం రమేష్

చోడవరం, ఏప్రిల్ 8: రాష్ట్రంలో టీడీపీ, బీజేపీ, జనసేనలకు మద్దతుగా నిలిచే వ్యాపారులను వేధించడం, బెదిరించడమే లక్ష్యంగా స్టేట్ డైరెక్టరేట్ ఆఫ్ ఇంటెలిజెన్స్ అధికారులు పనిచేస్తున్నారని అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ ఆరోపించారు. అనకాపల్లి జిల్లా చోడవరం పట్టణ శివారు గాంధీగ్రామంలో టైల్స్ వ్యాపారి బుచ్చిబాబు దుకాణంలో ఈనెల నాలుగో తేదీన డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు సోదాలు నిర్వహించారు. దాడుల సమాచారం తెలుసుకుని అక్కడకు చేరుకున్న సీఎం రమేష్, చోడవరం టీడీపీ అభ్యర్థి రాజు, తదితరులు... డీఆర్‌వో అధికారులను ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో సీఎం రమేష్, తదితరులు తమ పట్ల అనుచితంగా వ్యవహరించారంటూ ఆ శాఖ అధికారులు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి విచారణకు హాజరు కావాలంటూ చోడవరం పోలీసులు నోటీసులు ఇచ్చారు. సోమవారం సీఎం రమేష్, మాజీ ఎమ్మెల్యే రాజు, టైల్స్ వ్యాపారి బుచ్చిబాబుతో కలిసి స్థానిక పోలీస్ స్టేషన్‌లో అనకాపల్లి డీఎస్పీ ఎస్.అప్పలరాజు ఎదుట హాజరయ్యారు. డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ శాఖలో ఓ అధికారిపై చాలా ఆరోపణలున్నాయని, కేవలం కక్షపూరితంగానే వ్యాపారి బుచ్చిబాబుపై ఈ దాడులు జరిగినట్టు తమకు సమాచారం ఉందని సీఎం రమేశ్ డీఎస్పీకి వివరించారు. ఆ అధికారి తీరుపై తాము ఎన్నికల కమిషన్‌కు, కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ తదితరులకు ఫిర్యాదు చేశామన్నారు. దాడి జరిగిన సమయంలో వ్యాపారి నుంచి రూ.25 లక్షలు తీసుకున్నారని, ఆ డబ్బు ఏమైందో విచారణ జరిపించాలని డీఎస్పీని కోరారు. అధికారులను మీడియా సమక్షంలో ప్రశ్నించాం తప్ప, వారి పట్ల అమర్యాదగా ప్రవర్తించలేదని వివరించారు. ఇది పూర్తిగా తప్పుడు కేసు అని, తమపై అధికారులు చేసిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమని వివరణ ఇచ్చారు. దీనిపై డీఎస్పీ మాట్లాడుతూ, ఈ కేసుపై తాము సమగ్రంగా విచారణ చేస్తామని చెప్పారు. అనంతరం 41 సీఆర్‌పీసీ నోటీసులు ఎంపీకి, మాజీ ఎమ్మెల్యే రాజు, తదితరులకు అందజేసి సంతకాలు తీసుకున్నారు.

రెండు నెలల క్రితమే స్టేట్ డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ప్రణాళిక

పోలీస్ స్టేషన్‌లో విచారణకు హాజరైన సీఎం రమేశ్ అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కూటమి పార్టీలకు మద్దతుగా నిలబడే వ్యాపారులపై దాడులు చేయడం, బెదిరించి దారికి తెచ్చుకోవడం లక్ష్యంగా రెండు నెలల క్రితమే ఈ స్టేట్ డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ విభాగం ఆధ్వర్యంలో ప్రణాళిక రూపొందించారని విమర్శించారు. తనిఖీలకు వచ్చిన సదరు శాఖ అధికారులకు జీఎస్‌టీతో ఎలాంటి సంబంధం లేదని, ఆ శాఖ అధికారులకు జీఎస్‌టీ గురించి ప్రశ్నించవలసిన అవసరం ఏమీ లేదని తెలిపారు. అధికార పార్టీ ప్రయోజనాల కోసం ప్రతిపక్ష వ్యాపారులపై వేధింపులు, దాడులు లక్ష్యంగా తయారైన స్టేట్ డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ శాఖను రద్దు చేయాలని తాము కేంద్రానికి ఫిర్యాదు చేశామని స్పష్టంచేశారు. టైల్స్ వ్యాపారి బుచ్చిబాబు స్థానిక ఎమ్మెల్యే ధర్మశ్రీకి చెల్లించవలసిన ట్యాక్స్ కట్టలేక, అతని వేధింపులు భరించలేక తమను ఆశ్రయించారన్నారు. అమాయక వ్యాపారులను బెదిరించి దారికి తెచ్చుకోనేందుకు వైసీపీ నేతలు చేస్తున్న యత్నాలను అడ్డుకుని తీరతామన్నారు. వైసీపీ నేతల ఆగడాలను తాము సహించేది లేదని, వ్యాపారులకు, ప్రజలకు తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఎన్ని కేసులు పెట్టినా తాము భయపడేది లేదని ధైర్యంగా ఎదుర్కొంటామన్నారు. తాను బ్యాంకు రుణాలు ఎగ్గొట్టానని ఇతరత్రా అక్రమ వ్యాపారాలు చేస్తానని 'సాక్షి' పత్రిక ప్రచారం చేస్తున్నదని, తనపై ఎలాంటి అవినీతి మరకలు లేవన్న విషయాన్ని వారు తెలుసుకోవాలన్నారు. సీఎం రమేష్ వెంట మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.

బిల్లో... మొర్రో!

- కలెక్టర్ కార్యాలయానికి మరమ్మతులు
- రెండేళ్లు అయినా బిల్లు అందక కాంట్రాక్టర్ గగ్గోలు
- టోకెన్ జారీ అయినా బ్యాంకు ఖాతాలో జమ కాని సొమ్ము
- బిల్లు చెల్లించాలని కోర్టును ఆశ్రయించనున్న కాంట్రాక్టర్

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

జిల్లాల పునర్విభజన సందర్భంగా రెండేళ్ల కిందట జిల్లా కలెక్టర్ కార్యాలయ భవనానికి మరమ్మతు పనులు చేపట్టిన కాంట్రాక్టరుకు బిల్లు అందక కాళ్లరిగేలా తిరుగుతున్నారు. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు పూర్తి చేశారు. ఇది జరిగి రెండేళ్లు కావస్తున్నా బిల్లు అందని పరిస్థితి నెలకొంది. బిల్లు చెల్లించకపోవడంపై తనకు న్యాయం చేయాలని ప్రభుత్వంపై సదరు కాంట్రాక్టరు కోర్టును ఆశ్రయించేందుకు సిద్ధమవుతున్నారు. వివరాల్లోకి వెళితే..

2022 ఏప్రిల్ నెలలో జిల్లాల పునర్విభజన సందర్భంగా వైసీపీ ప్రభుత్వ ఆదేశాల మేరకు అనకాపల్లి మండలం శంకరంలో ఒక కళాశాల భవనాలకు మరమ్మతులు చేపట్టేందుకు రూ.60 లక్షల అంచనాలు రూపొందించారు. అప్పట్లో టెండర్లు పిలిచారు. ఇందులో నర్సీపట్నంకు చెందిన సాలిడ్ కన్‌స్ట్రక్షన్స్ అనే సంస్థ రూ.58.60 లక్షలకు పనులు దక్కించుకుంది. రోడ్లు, భవనాల శాఖ అధికారులు పనులను కాంట్రాక్టర్‌కు అప్పగించారు. కళాశాల భవనం పూర్తిగా పాడవడంతో పెయింటింగ్ పనులతోపాటు లోపల గదుల్లో ఇంటీరియర్ వర్క్స్ చేపట్టారు. కలెక్టర్, జేసీలకు అధునాతన హంగులతో చాంబర్లను ఏర్పాటు చేశారు. కలెక్టరేట్‌లో అన్ని విభాగాలకు మరుగుదొడ్లు, సీలింగ్, ఇతరత్రా సివిల్ వర్క్స్‌తోపాటు ఫర్నిచర్ కూడా కాంట్రాక్టరే సమకూర్చారు. మే నెలాఖరు నాటికి కాంట్రాక్టరు మరమ్మతు పనులు పూర్తిచేశారు. 2022 సెప్టెంబరులో కాంట్రాక్టరు చేసిన పనులకు సంబంధించిన చెల్లింపుల కోసం రూ.58.60 లక్షలు బిల్లులను సీఎఫ్‌ఎంఎస్ ద్వారా రోడ్లు, భవనాల శాఖ ఇంజినీర్లు అప్‌లోడ్ చేశారు. దీనికి సంబంధించి ఖజానా శాఖ నుంచి టోకెన్ నంబరు కూడా వచ్చేసింది. టోకెన్ నంబరు జారీ అయ్యాక సాధారణంగా బిల్లులు ఆగవు. కానీ కలెక్టరేట్ మరమ్మతు పనులు చేపట్టిన కాంట్రాక్టరుకు టోకెన్ జారీ అయినా డబ్బులు మాత్రం బ్యాంకు ఖాతాలో జమ కాలేదు. వాస్తవానికి పనులు పూర్తయిన వెంటనే బిల్లు చెల్లించాలని కాంట్రాక్టరుతో అగ్రిమెంట్ కుదిరింది. కొంతవరకు మరమ్మతు పనులు చేపట్టిన కాంట్రాక్టరు కొంతమొత్తం పార్టు బిల్లు చెల్లించాలని కోరినా అధికారులు నిధుల కొరత లేదు.. మొత్తం పనులు పూర్తయిన తరువాత చెల్లిస్తామని చెప్పడంతో కాంట్రాక్టరు ఒక్క పైసా అడ్వాన్స్ తీసుకోకుండానే మరమ్మతు పనులు పూర్తి చేశారు. కలెక్టరేట్ పనులు పూర్తిచేసి రెండేళ్లు కావస్తున్నా.. బిల్లు అందక కాళ్లరిగేలా కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నారు. గతంలో స్పందన కార్యక్రమంలో అనేకసార్లు బిల్లు చెల్లించాలని వినతిపత్రాలు అందించినా ఎటువంటి స్పందన రాలేదని కాంట్రాక్టరు ఆవేదన చెందుతున్నారు. చేసిన పనులకు బిల్లు చెల్లించకపోవడంపై కాంట్రాక్టరు కర్రి గంగాధర్ కోర్టును ఆశ్రయించనున్నట్టు తెలిసింది.

'సింహాద్రి'లో పీసీఎస్‌సీ సమావేశం

- దక్షిణ ప్రాంతంలో గ్రిడ్ భద్రత, ఇతర సమస్యలపై చర్చ
- ఆరు రాష్ట్రాల నుంచి హాజరు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఆర్‌పీసీ కార్యదర్శి అసిత్‌సింగ్

పరవాడ, ఏప్రిల్ 8 : సింహాద్రి సూపర్ థర్మల్ విద్యుత్ కేంద్రం (ఎన్టీపీసీ)లో సోమవారం రక్షణ సమన్వయ సబ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి సదరన్ రీజనల్ పవర్ కమిటీ (ఎస్ఆర్‌పీసీ) కార్యదర్శి అసిత్‌సింగ్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరిలో గల విద్యుత్ సంస్థల నుంచి 33 మంది సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా దక్షిణ ప్రాంతంలో గ్రిడ్ భద్రతకు సంబంధించిన ఆటంకాలు, గ్రిడ్ సంఘటనలు, ఇతర సమస్యల గురించి చర్చించారు. అనంతరం సింహాద్రిలో గల 25 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్‌ప్లాంట్, సీ వాటర్ పంప్‌హౌస్ తదితరాలను సభ్యులు సందర్శించారు. ఈ కార్యక్రమంలో సింహాద్రి హెచ్‌ఓపీ సంజయ్ కుమార్ సిన్హా, ఎస్ఆర్‌పీసీ సూపరింటెండెంట్ ఇంజినీర్ మేకా రామకృష్ణ, సింహాద్రి ఓఅండ్‌ఎం జీఎం జె.డేవిడ్, ఆపరేషన్ విభాగం జీఎం ఆర్. రాజగోపాలన్‌తో పాటు సంస్థలోని వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

కొత్త అమావాస్య పండగ జరుపుకున్న ట్రాన్స్‌జెండర్లు



ఎలమంచిలి, ఏప్రిల్ 8: పట్టణంలోని రామ్‌నగర్ శేషుకొండ కాలనీలో సోమవారం స్థానిక ట్రాన్స్‌జెండర్స్ భక్తిశ్రద్ధలతో కొత్త అమావాస్య జాతరను జరుపుకున్నారు. ట్రాన్స్‌జెండర్స్ ప్రతినిధి శ్రావణి తదితరులు అమ్మవారి ఘటాలను ఊరేగింపుగా తీసుకెళ్లి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

గ్రామ వలంటీర్లు మూకుమ్మడి రాజీనామా

- ఒక పత్రంపై రాజీనామాలు చెల్లవంటూ ఎంపీడీవో స్పష్టీకరణ
- వ్యక్తిగతంగా రాజీనామా పత్రాలు ఇవ్వాలని సూచన

ఎస్.రాయవరం, ఏప్రిల్ 8: మండలంలోని 438 మంది వలంటీర్లు రాజీనామా చేస్తున్నట్టు గురజాడ అప్పారావు వలంటీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్. అప్పలరాజు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఎంపీడీవో సత్యనారాయణమూర్తికి అసోసియేషన్ లెటర్ హెడ్‌పై వినతిపత్రాన్ని ఆయనతోపాటు కొంతమంది వలంటీర్లు అందజేశారు. తమ రాజీనామాలను ఆమోదించాలని కోరగా.. ఎంపీడీవో స్పందిస్తూ వలంటీర్లంతా రాజీనామాలు చేస్తున్నట్టు ఇచ్చిన ఒకే రాజీనామా పత్రం చెల్లదని, ఎవరికి వారు రాజీనామా పత్రాలు సమర్పిస్తేనే చెల్లుతుందని స్పష్టం చేశారు. దీంతో మరో రోజు వ్యక్తిగతంగా రాజీనామా పత్రాలు తీసుకువచ్చి సమర్పిస్తామంటూ వారంతా వెనుదిరిగారు.ఈ సందర్భంగా మండల వలంటీర్ల అసోసియేషన్ ప్రెసిడెంట్ అప్పలరాజు మాట్లాడుతూ ఇటీవల జరిగిన కారణాల వలన ప్రజాసేవ చేస్తున్న తమకు ప్రతిపక్షాలు ఇబ్బందిపెడుతున్నందున రాజీనామాలు చేస్తున్నట్టు చెప్పారు.

నేడు చిలకల తీర్థం

- వేలాదిగా తరలిరానున్న భక్తజనం
- సంప్రదాయబద్ధంగా పేరంటాలమ్మ వేడుక
- ఈ తీర్థంలో చిలకలు, చేటలు, శనగపిండి నేతి మిఠాయి ప్రత్యేకత
- పటిష్ట బందోబస్తు ఏర్పాటు : సీఐ అప్పలరాజు


పాయకరావుపేటలోని పేరంటాలమ్మ గుడి

పాయకరావుపేట, ఏప్రిల్ 8 : పట్టణంలో మంగళవారం చిలకల తీర్థం ఘనంగా జరగనుంది. ఏటా ఉగాది రోజున సంప్రదాయబద్ధంగా జరుపుకునే చిలకల తీర్థం ఈ ప్రాంతానికే ప్రత్యేకం. స్థానిక మంగవరంరోడ్డులో ఉన్న పేరంటాలమ్మ గుడి వద్ద మంగళవారం జరిగే ఈ తీర్థానికి వేలాదిగా తరలివచ్చే భక్తులు అమ్మవారి దర్శనం అనంతరం పక్కనే ఉన్న రామాలయంలో పండితులతో శ్రీ క్రోధి నామ సంవత్సరంలో తమ రాశిఫలాలు చెప్పించుకుంటారు. ఆలయ వెలుపల నిర్వహించే తీర్థంలో పంచదార చిలకలు, రంగుల చేటలను కొనుగోలు చేసి ఇళ్లకు తీసుకెళ్లడం పూర్వం నుంచి ఆనవాయితీగా వస్తోంది. పట్టణంలోని రాజాపంతులవారి ఆడబిడ్డగా.. మలిపెద్దివారి కోడలుగా అగ్నిగుండం లోకి ప్రవేశించి స్థానిక మంగవరంరోడ్డులోని సీతారామస్వామివారి ఆలయం వద్ద పేరంటాల మ్మగా వెలసిందని పెద్దలు చెబుతుంటారు. ఈ పేరంటాలమ్మను ఇలవేల్పుగా కొలుస్తున్న ఈ ప్రాంత ప్రజలు ఐదు తరాలుగా ఉగాది రోజున పేరంటాల మ్మను దర్శించుకుంటారు. ఉగాది రోజు సాయంత్రం మూడు నుంచి నాలుగు గంటల మధ్యలో పేరంటాలమ్మ గుడివద్ద మలిపెద్దివారి కుటుంబ సభ్యుల్లో ఒకరిపైకి పేరంటాలమ్మ వచ్చి భవిష్యవాణి వినిపిస్తారు. అమ్మవారు పుణ్యస్త్రీగా అగ్నిగుండ ప్రవేశం చేసినందున గుడికి వచ్చిన మహిళలంతా సంప్రదాయ సూచికగా తీర్థంలో చేటలు, చిలకలు కొనుగోలు చేసి ఇళ్లకు తీసుకెళుతుండడంతో దీనికి 'చిలకల తీర్థం'గా పేరు వచ్చింది. ఈ తీర్థానికి పాయకరావుపేట, తుని పట్టణాలతోపాటు పరిసర 30 గ్రామాల నుంచి వేలాదిగా ప్రజలు తరలివస్తారు. ఈ ఏడాది చిలకల తీర్థానికి నిర్వాహకులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. తీర్థంలో పంచదార చిలకలు, రంగుల చేటలతోపాటు నెయ్యి, బెల్లం, శనగపిండితో తయారుచేసే నేతి మిఠాయిని కొనుగోలు చేస్తారు. అయితే మంగవరం రోడ్డుతోపాటు మెయిన్‌రోడ్డు ఇరువైపులా ఆక్రమణలు పెరిగిపోయి రోడ్లు ఇరుకుగా మారడంతో తీర్థానికి అధిక సంఖ్యలో వస్తున్న భక్తులు ట్రాఫిక్ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఏడాది చిలకల తీర్థంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని సీఐ అప్పలరాజు తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం నుంచి రాత్రి 10 గంటల వరకు మెయిన్‌రోడ్డులోకి వాహనాలు రాకుండా ఆంక్షలు విధించి ట్రాఫిక్ కంట్రోల్ చేస్తామని ఆయన తెలిపారు.


సిద్ధం చేసిన పంచదార చిలకలు, చేటలు

విశాఖ రైల్వే స్టేషన్‌లో కుంగిన ఫుట్ ఓవర్ బ్రిడ్జి


కుంగిపోయిన ఫుట్ ఓవర్ బ్రిడ్జి

విశాఖపట్నం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో సోమవారం ఉదయం ఆకస్మికంగా ఫుట్ ఓవర్ బ్రిడ్జి కుంగిపోయింది. ఈ విషయం గమనించిన అధికారులు వెంటనే దానిపై రాకపోకలు నిలిపివేశారు. విశాఖపట్నం రైల్వే స్టేషన్ లోపలకు వెళ్లేందుకు ముఖ ద్వారం వైపు మూడు మార్గాలు ఉన్నాయి. అందులో దక్షిణం వైపు ద్విచక్ర వాహనాల పార్కింగ్ సమీపానున్న మార్గాన్ని ఎక్కువ మంది ప్రయాణికులు ఉపయోగించుకుంటారు. ఆ మార్గంలోని ఫుట్ ఓవర్ బ్రిడ్జి మూడు, నాలుగు ప్లాట్‌ఫారాల మధ్య కిందకు కుంగిపోయింది. ప్రత్యామ్నాయ మార్గాలను ప్రయాణికులు ఉపయోగించుకోవాలని అధికారులు సూచించారు. వెంటనే దానికి మరమ్మతులు చేపట్టారు. అత్యంత వేగంగా దానిని తిరిగి అందుబాటులోకి తీసుకువస్తామని డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ తెలిపారు. మూడు, నాలుగు ప్లాట్‌ఫారాలపైకి రెగ్యులర్‌గా వచ్చే రైళ్లను ఇతర ప్లాట్‌ఫారాల పైకి సర్దుబాటు చేస్తున్నారు. దాంతో పలు రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి.

పుచ్చకాయల సాగు.. ఆదాయం బహు బాగు


పుచ్చకాయలను వ్యాన్‌లో లోడ్ చేస్తున్న కూలీలు

దేవరాపల్లి, ఏప్రిల్ 8: మండలంలో కొండ కొండాబు, దేవరాపల్లి సమీపంలో పుచ్చకాయల సాగు విస్తారంగా సాగుచేశారు. తామరబ్బ శివారు కొండ కొండాబు వద్ద తాడేపల్లి గూడెంనకు చెందిన ఏవీ కృష్ణారావు, సుమారు పదేళ్లుగా పుచ్చకాయలను సాగు సాగిస్తున్నారు. ఈ ఏడాది ఎనిమిది ఎకరాల్లో పంట పండిస్తున్నారు. ఏటా ఈ పొలంలో పుచ్చ సాగు తప్ప మరే పంట వేయడంలేదు. పచ్చి రొట్ట ఎరువు వేసి వాటిని కలియ దున్ని తరువాత పంట సాగుచేస్తున్నారు. ఈఏడాది ఒక్కోకాయ 8నుంచి 12 కిలోల వరకు పెరిగింది. విశాఖపట్నానికి చెందిన వ్యాపారులు పొలం వద్దకు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. ఎనిమిది ఎకరాల్లో 140 టన్నులు పంట దిగుబడి రాగా , మరో ఇరవై టన్నుల మేర కోయడానికి సిద్ధంగా ఉందని కృష్ణారావు తెలిపారు. టన్ను సైజు (10నుంచి 12 కిలోలు) బట్టీ రూ. 12వేలు పలకగా, చిన్నవి 5నుంచి 8 కిలోల వరకు రూ.11వేల చొప్పున విక్రయించినట్టు చెప్పారు. కరోనాలో కాలంలో తప్పా మిగతా రోజుల్లో నష్టం లేకుండా పంట పండుతుందన్నారు.

పదేళ్లనుంచి ఇదే సాగు



సుమారు పది సంవత్సరాల నుంచి పంట వేస్తున్నాను. గతంలో మొక్కజొన్న వేశా. తుపానులకు నష్టం వాటిల్లింది. అప్పటి నుంచి పుచ్చకాయలు సాగు చేస్తున్నాను. నవంబరు నుంచి పంట వేసే ప్రక్రియ చేపడితే.. మార్చి, ఏప్రిల్ మొదటి వారంతో సరి. మరలా వచ్చే ఏడాది వ రకు ఖాళీయే.. సైజు బట్టి పుచ్చకాయ ధర పలుకుతుంది. సాగు గిట్టుబాటవుతోంది. - ఏవీ కృష్ణారావు, సాగుదారు